# ఇహంపరం

'మీకిది న్యాయమేనా? నాకు అన్యాయం జరిగినా నేనింతగా బాధపడేదాన్నికాదు. కాని పిల్లలకు ఇలా అన్యాయం జరుగుతుంటే సహించలేను. అంతా ఏమంటున్నారో తెలుసా?...

అసలు మీమట్టుకు మీకు ఇది న్యాయంగా కన్పిస్తున్నదా?"

ఇంటికి రాగానే భర్తను గట్టిగా అడగాలని అనుకొన్నది శారద.

ఆమె ఇంకా చాలా విషయాలు అడగాలనీ, ఆ పూట తాడో పేడో తేల్చుకోవాలనీ అనుకొన్నది. మెడలో తాడు తెగకుండానే సంబంధం తెగిపోయే స్థితి కలుగుతున్నందుకు. ఆ పరిస్థితిని తాను వారించలేక పోతున్నందుకు ఆమె బాధపడ్డది; కృంగిపోయింది; తను మోసపోయి నట్లు స్పష్టం అయ్యేసరికి పట్టరాని కోపం వచ్చింది. రోషం ముంచుకొని వచ్చింది. వళ్ళు వణికిపోయింది. ముఖం చెమటపట్టింది; చేతకానితనం స్ఫురణకు వచ్చి, దుఃఖం దిగమ్రింగుకొంటూ, విసురుగా పమిటకొంగు ముందుకు లాక్కొని నుదురు, చెంపలు గట్టిగా తుడుచుకొన్నది. కొన్ని క్షణాల తర్వాత బొట్టు చెరిగిపోయిందని గుర్తించి, కుంకుమ భరిణ కోసం వెతుక్కొంటూ ముందు గదిలోకి వెళ్ళింది. అది కన్పించింది కాని నిండుకొన్నది. ఇప్పుడు తొందరేమొచ్చిందిలే అనుకొని విసుక్కొంటూ ఆమె వెనుతిరిగింది ఎదురుగా గోడకు పైయెత్తుగా పెళ్ళినాటి ఛాయాచిత్రం కన్పించింది. ఆమె అప్రయత్నంగా అక్కడే ఆగి పోయింది.

# 2

'ఎంత అందమైన మనిషి! అవును ఆ అందమే ఆనాడు నన్ను ఆకట్టుకొన్నది. ఆనాడు ఎదురైన అన్ని ఆటంకాలు అధిగమించడానికి ఆ అందమే తన్ను ప్రోత్సహించింది. అవును ఈనాడు ఇంత ప్రమాదం తెచ్చిపెట్టిందికూడ ఆ అందమే.'

'నిజమే' అనుకొంటూ ఆమె ముందుకు అడుగువేసింది. 'మగవాడు అంత అందగాడు కావడం ప్రమాదమే' పెండ్లి అయిన క్రొత్తల్లో ఆమె నాయనమ్మ అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి. 'మరి నేనూ అందకత్తెనే కదే?' అని తను అంటేవెంటనే నవ్వుతూ ఆ ముసలావిడ 'నువ్వు ఇంట్లో ఉందానివి. అతను బజార్లో తిరిగే మనిషి- మరి తేడాలేదూ ఎవరైనా ఇట్టే ఎగరేసుకొని పోగలరు" అంటూ అప్పుడాడినపరిహాసాలు కూడా జ్ఞాపకం వచ్చాయి.

'అవును అవే నిజం అయ్యాయి. నేను మొదటినుంచీ మోసంలో పడ్డాను. ఆయనగారు కేవలం నన్నుచూచి, నా చదువు సంధ్యలు, కుటుంబ మర్యాదలు చూచి చేసుకొన్నారని అనుకొన్నాను. వివాహానికి పూర్వమే ప్రేమించుకొన్నా, అలాఅని అందరికీ తెలిసినా, పెద్దవాళ్ల వ్యతిరేకిస్తున్నారని పెండ్లి నమోదు చేసుకొన్నా ఇంట్లో అందరూ తప్పని సరిఅయి ఒప్పుకొని శాస్త్రోక్తంగా తంతుఅంతా జరిపించి, మూడు ముళ్ళు వేయించేదాకా ఏమాత్రం తొందరపడలేదు. పెద్దమనిషి తరహా అంటే ఇదే సుమాఅని అంతా అనుకొనేలా ప్రవర్తించారు. ఎంత గొప్పగా నటించారు! మూడు రాత్రులు-అబ్బో ఏం మురిపించారు! ఆ తర్వాత - మూడోనాటినుంచే వేరే కాపురం పెట్టించేదాకా నిద్రపోలేదు. అలా తన వంతం నెగ్గాక నగలతోపాటు సమస్తమైన సామాన్లతో వేరింటి కాపరానికి వచ్చాక, అమ్మమ్మ పేరునఉన్న ఇల్లు నా పేరున మార్పించుకొనేదాకా ఒకటే పోరు. అదీ అయింది. ఇక అక్కడినుంచి అప్పుడో వెయ్యి అప్పుడో వెయ్యి గుంజడం మొదలు

పెట్టారు. కట్నం ఇవ్వవేసివస్తే మీవాళ్ళు ఇచ్చేవాళ్ళేగా! వెళ్ళి అడుగు. అడిగితేనేగాని అమ్మయినా పెట్టదని సామెత. ఏం వాళ్ళు లేనివాళ్ళు కాదుగా? అంటూ ఒకటే సాధింపు. నేను ఎక్కడ బాధపడిపోతానో అని భయపడి వాళ్ళు యిచ్చారు. అట్లా పోగయిన డబ్బు పెట్టేగా ఆయన పాతకారు కొన్నారు.'

'పాతకారు! తనూ అంతే ఇవ్వడు.'

ఆమె అలా అనుకొంటూ వెనుక గదిలోకి నడిచింది.

'ఆ కారు కొన్నాక అతనికి బాగా కలిసి వచ్చింది' అన్నారు ఆయన మిత్రులు.

మామగారి సిఫార్సుతో, బావమరిది కృషిఫలితంగా లభించిన ఉద్యోగంలో రెండేళ్ళుకూడా గడవకముందే ఆయన పైమెట్టు ఎక్కాడు. హోదా పెరగడంతో స్నేహాలు మారాయి. ప్రవర్తన మారింది. క్లబ్బులు, పేకాట, విందులు, సినిమాలు, షికార్లు ఆయనకు మామూలు అయింది ఉదయం పూజా పునస్కారాలు దూరం అయ్యాయి. అదేమిటి మీ నాన్నగారు శ్రీ విద్యోపాసకులు, తపస్సంపన్నులు, ఆయన దగ్గర ఉపదేశంకూడా పొందానన్నారు- ఆ పద్ధతిలో నడిస్తే మీకూ, నాకూ ఇహపర సౌఖ్యాలు నిశ్చయంగా లభిస్తాయని అన్నారే మరి ఎందుకిలా అపచారం చేస్తున్నారని శారద అంటే ఆయన నవ్వుతూ "నువ్వు చేశావుగా పూజలు. దేవీ విగ్రహంముందు నిలబడి ఎన్ని ప్రమాణాలు చేశావు! అన్నీ గాలికిపోయాయిగా. ఎందుకా గొడవ. నీ పూజాఫలం నేను, నా పూజాఫలం నువ్వు. ముందు ఇహం విషయం చూచుకోనీ. రెండోదానికి ఇంకా చాలా వ్యవధివున్నదిలే" అన్నాడు. ఆమె అలా చాలాసార్లు అన్నది. అతనూ అలా అని ప్రతీసారీ సమాధానం చెప్పాడు. అలా అంటూనే అతనూ వేళాపాళా లేకుండా ప్రక్కగదిలోకి లాక్కొని వెళ్ళాడు.

"అవును- ఎప్పుడైనా కాదన్నానా? వయసు అటువంటిది. కాలం అటువంటిది. వ్యామోహం అంత బలమైనది. అవసరం మట్టుకు తక్కువదా?-ఆకలిలాగానే ఆకలికైనా ఒక అంతు- తీరడం అంటూ ఉన్నదేమో కాని దీనికి?" అలా అనుకొనేసరికి శారద ఒక్కసారి నిలువునా పులకించిపోయింది. పెదవులు వణికాయి. నిండైన వక్షోజాలు పొంగి, బిగువై, మరింత ఉబ్బిపోయాయి. అప్రయత్నంగా ఆమె అర చేతులతో రొమ్ములు ఒత్తుకొన్నది. జాకెట్టు ముడి సడలించింది. కొన్ని క్షణాల తర్వాత పెద్దగా నిట్టూర్పువిడిచి, పమిట నిండుగా కప్పుకొని పిల్లలు పడుకొన్న గదిలోకి వెళ్ళింది. ఇద్దరు పిల్లలకూ దుప్పటి సరిగా కప్పి, దిండ్లు సరిగా అమర్చి మళ్ళీ పడకగదిలోకి వచ్చింది. అటూ ఇటూ పచార్లు చేసింది. బల్లపైన మంచినీళ్ళ కూజామీద మూతపెట్టిన పుస్తకం తీసుకొని, మంచంమీద చివరగా కూర్చుని చదవడానికి ప్రయత్నం చేసింది.

కాని ఒక్క అక్షరం ముందుకు సాగలేదు

ఆలోచనలు వెనక్కు పరుగెత్తాయి.

కొన్ని నిముషాల తర్వాత 'నాకు ఈ నిరీక్షణ కూడా బాగా అలవాటేకదా!' అనుకొన్నది శారద.

'అవును ఏలూరులో ఏమైంది! ప్రతిరోజూ రాత్రి ప్రొద్దుపోయే దాకా ఆయనగారు క్లబ్బునుంచి ఇంకా వస్తారు ఇంకా వస్తారని ఎదురు చూస్తూ కూర్చునేదాన్ని. ముందు గదిలో కుర్చీలో కూర్చునే కునికిపాట్లు పడేదాన్ని. చివరకు చాపవేసుకొని అక్కడే నిద్రపోయేదాన్ని. అలా ఆరునెలలు గడిచాక కదూ నాన్నగారు, ఏదోపనిమీదవస్తే ఉండబట్టలేక అన్నీ చెప్పుకొన్నాను. ఆయన తిరిగి వెళ్ళేరోజున నువ్వు మరీ అంత బెంగ పెట్టుకోకు. అది ఆఫీసర్ల క్లబ్బు. తన పలుకుబడి పెంచుకోడానికి

మాత్రమే వెళుతున్నాడు. నెమ్మదిగా మాన్పించాలి' అని ధైర్యం చెప్పారు.

శారద భర్త ఆ మరునాడే కారు అమ్మేశాడు. వెంటనే నెల రోజులు సెలవు పెట్టి మద్రాసు వెళ్లాడు. ఏదో వ్యాపారం ప్రారంభిస్తున్నాననీ, ఊరు విడిచి వెళ్ళినట్లు ఎవ్వరితోనూ చెప్పవద్దనీ భార్యతో చెప్పి వెళ్ళాడు. ఆమె నమ్మింది. కాని పది రోజులతర్వాత ఆమె తమ్ముడు వచ్చి "బావ చాలా ప్రమాదం తెచ్చిపెట్టుకొన్నాడు. ఆవిడే బావను లేవదీసుకొని పోయిందట. ఆమె నగలన్నీ అమ్మేశాడట. ఇరవైవేల రూపాయలు ఖరీదుచేసే నగలన్నీ పొయ్యాయని ఆవిడగారి అన్నదమ్ములు, బంధువులు పెద్దగొడవ చేస్తున్నారు. ఆవిడ తలచెడిన మనిషి. వయసుకూడా ఎక్కువే. ఆవిడకు పోయేదేంలేదు. మనకు గౌరవం, మర్యాదా పోయాయి. పోనీ అని తల వంచుకొని పోదామన్నా వీల్లేకుండా వచ్చింది. బావ కంటబడితే పనసకాయ తరిగినట్లు తరిగేస్తామంటున్నారు. కక్ష కట్టారు. వాళ్ళు ఎంతపనైనా చెయ్యగల మనుష్యులు అని చెబితే ఆమె బెదిరిపోయింది.

"మరేం చేద్దాం?"

భయపడుతూ, భయపడుతూ అడిగింది శారద.

"నేను చెప్పినట్లు చెయ్యి."

ఆమె తమ్ముడు ఉపాయం చెప్పాడు. "అల్లాగేరా తమ్ముడూ" అన్నది.

ఎన్నడో జరిగిన సంగతులన్నీ ఒక్కసారి జ్ఞాపకం వచ్చేసరికి, అవన్నీ తన కళ్ళముందు అప్పుడే జరుగుతున్నట్లు అనిపించేసరికి శారద భయంతో కంపించింది.

"అవును అప్పుడు అలా ఊరు మార్చబట్టే ఆ గండం గడిచింది. బస్తీలో ఇల్లు తీసుకొని కాపురం పెట్టించిన నెలరోజులకు అత్తవారింటికి పండుగకు వచ్చిన క్రొత్త అల్లుడులా వచ్చారు. ఏమీ ఎరగనట్లే కన్పించారు. తన తప్పేమి లేనట్లే మాట్లాడారు. మద్రాసులో వ్యాపారం చేశాను కాని మొదట్లోనే నష్టం వచ్చింది. పెట్టుబడి ఆవిడది. నష్టం వచ్చింది కనుక అంత గొడవ చేసింది. లాభం వచ్చిఉంటే నన్ను అందలం ఎక్కించి ఉండేది మరికొంత పెట్టుబడి పెడితే వ్యాపారం మళ్ళీ సాగేది. కాని వీలుపడలేదు. వ్యాపారం అలా దెబ్బతిన్నదనే వాళ్ళ వాళ్ళు నాపై కత్తికట్టారు నేను ఇలా బదిలీ చేయించుకొని రావలసి వచ్చింది" అంటూ అందరితో కథ అల్లి చెప్పారు. ఊరివారితో ఏమి చెప్పినా ఫరవాలేదు. కాని నాతోనూ అలాగే చెప్పారు. ఎంత నిర్భీతి! ఆ మాటలు విని ఊరుకోవడమే మంచిది అనిపించింది, అవును ఇక్కడకు వచ్చినప్పటినుంచీ ఆయన ప్రవర్తన మారింది. ఎంతో జాగ్రత్తగా ఉన్నారు. పిల్లలు కలిగాక ఆయన పూర్తిగా మారిపొయ్యారు.

ఎప్పటి సంగతులో ఇప్పుడెందుకు? నిజమే. నేను మొదటినుంచీ ఇలాగే అనుకుంటూ వచ్చాను. మొగవాడు ఏం చేసినా ఫరవాలేదు. తప్పు పట్టరు. అదీకాక మళ్ళీ నర్దుకొన్నాడు. అటువంటి సందర్భంలో అల్లరి పెడితే దూరం అయిపోతాడు. కాలం అటువంటిది. ప్రత్యేకంగా ఆయన్ను అని లాభంలేదు అనుకొని సర్దుకొన్నాను. ఆయన మళ్ళీ కారుకొన్నప్పుడు అది కేవలం నాకోసం, నా పిల్లలకోసం అనుకొని సంతోషపడ్డాను. పిల్లలను బడికి, నన్ను బజారుకు సినిమాలకు కారులో తీసుకొని వెళ్ళినప్పుడల్లా పొంగిపోయాను. 'ఇక ఫరవాలేదు' అని తృప్తి పడ్డాను కాని. అనుకొంటూ శారద చేతిలోఉన్న పుస్తకం మూసి మంచంమీద దూరంగా పడేసింది. కొన్ని క్షణాల తర్వాత సంవత్సరం క్రిందటి వరకు ఆయనలో వేలెత్తి చూపదగిన లోపమే కన్పించలేదు.

కాని...ఆఫీసరు పదవి లభించిన రోజున..." అలా అనుకొంటూ ఆమె కునికిపాట్లు పడుతూ మంచంమీద నడుము వాల్చింది.

పై పదవి వచ్చినరోజున పెద్ద హోటలులో విందుభోజనం ఏర్పాటు చెయ్యడానికి శారద ప్రోత్సహించింది. తను దాచిపెట్టుకున్న డబ్బు ఇచ్చింది. పిల్లలను తీసుకొనివెళ్ళి విందులో పాల్గొన్నది. ఆ మరునాడు ఆయన స్నేహితుడు ఒకరు ఇంటికి వచ్చి "ఇలాంటి పిచ్చి పార్టీలుకాదు. పద బార్ కు. మన హోదాకు తగినట్టుగా ఉండాలి. అదీ కాక ఇవ్వాళ ఒక ప్రత్యేక ప్రయోజనంకూడా ఉన్నది" అంటుంటే శారద ప్రక్కగదిలోనుంచి ఆ మాటలు విని భర్తను లోపలికి పిల్చింది. "ఆ" అంటూ వెంటనే లోపలకు వచ్చిన భర్తతో "రానని చెప్పేయండి. ఏదో కారణం చెప్పి తప్పించుకోండి. అతన్ని చూస్తేనే నాకేదో భయంగా ఉన్నది. కుడి కన్ను అదురుతోంది. మీరు విడిగా ఎక్కడకూ వెళ్ళద్దు. మనం అంతా కలిసి సినిమాకు వెళదాం నామాట కాదనకండి" అంటూ బ్రతిమిలాడింది. అందుకు నవ్వుతూ "అతను ఎవరనుకొన్నావ్! పెద్ద ఆఫీసరు ఐ. ఏ. ఎస్. ఆఫీసరు స్వయంగా వచ్చి పిలిస్తే వెళ్లకపోవడం మర్యాదకాదు. బార్ అంటే ఐస్ క్రీమ్ బార్. అది తెలియక నువ్వు గాభరాపడుతున్నావు. నేనూ మొదట అలాగే తికమకపడ్డాను. అసలు విషయం తెలుసుకొన్నాక నువ్వూ నవ్వేస్తావు. రేపు మనం పిల్లలనుకూడా తీసుకొని అక్కడికే వెళదాం. అప్పుడు నీ అనుమానం తీరిపోతుంది" అన్నాడాయన శారదకు ధైర్యం చెబుతూ. శారద ఆరోజు రాత్రి పన్నెండు గంటలు దాటేదాకా వేచిఉండి ఆ తర్వాత నిద్రపోయింది. తలుపు కొడితే కూతురు వెళ్లి తీస్తే ఆయన చప్పుడు చెయ్యకుండా వచ్చి దుప్పటి నిండా ముసుగు పెట్టుకొని ఎవరితో ఒక్కమాటకూడా మాటాడకుండా పడుకొని నిద్రపోయాడు.

ఉదయం తొమ్మిదింటికిగాని నిద్ర లేవలేదు. నిద్ర లేస్తూనే ఆయన వాంతి చేసుకొన్నాడు.

ఆ పూట పరిచయం అయింది ధనం. ఆమె పెండ్లి కాని ప్రౌఢ. మందిలో తిరగనేర్చిన మనిషి. ఆటగుల్మం. అందాల భరిణ. ఆరోగ్యవతి. ఆకర్షణ ఆమె సొత్తు. ఆమె తండ్రికి అపరిమితమైన ఆస్తిఉన్నది. ఆయనకు ఆమె ఒక్కర్తే సంతానం పెద్దచదువులు చదివిన గారబాల కూతురు ఏమంటే ఎటు పోతుందో అని భయపడి ఆ తండ్రి ఆమె ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగిస్తున్నాడు.

ధనం దుర్వ్యసనంలా పట్టుబడ్డది రాజేంద్రానికి. దుష్టుడితో స్నేహంలా ఆమెతో అతనికి ఆ అనుబంధం ఇట్టే బలపడ్డది. రాజేంద్రం రెండోకంటికి తెలియకుండా కారు అమ్మేశాడు. ఆ డబ్బు పూర్తిగా విలాసాలకు ఖర్చుపెట్టాడు. ఆమె మెప్పు పొందడానికి అన్ని విధాలా ప్రయత్నించాడు. నెల రోజుల తర్వాత ఆమెను తనకు పాన శాలలో పరిచయం చేసిన మిత్రునితో "ఈ తార నాది నేను దక్కించు కొంటాను. నువ్వు తప్పుకో" అన్నాడు రాజేంద్రం. అతను నవ్వుతూ "ఇకనుంచి అను" అని ఒక క్షణం ఆగి నవ్వు ఆపుకొని "సరే" అన్నాడు. అలా అంటూనే అతను తప్పుకొన్నాడు.

రాజేంద్రం వల విసిరాడు.

ధనం బోను తలుపులు తెరిచింది. తను పన్నిన వలలో పెద్దచేప చిక్కిందని రాజేంద్రం అనుకుంటే తను పెట్టిన బోనులో పురుష సింహం చిక్కుకొన్నదని ధనం అనుకొన్నది. అలా అనుకొని ఆ ఇద్దరూ మురుసుకొన్నారు. తెగ మురుసుకొన్నారు.

కొద్దిరోజుల తర్వాత ఆమె అతన్ని తీసుకొని విమానంలో విదేశాలకు వినోదయాత్రలకు వెళ్ళింది. సాంస్కృతిక ప్రతినిధివర్గంతో

కలిపి తన్ను ప్రభుత్వమే విదేశాలకు పంపిస్తున్నదని ముందే అతను అందరితో చెప్పకొన్నాడు. భార్యతోకూడా అలాగే చెప్పాడు. ఆమె నిజం అనుకొన్నది; గర్వపడ్డదికూడాను. యాత్రలనుంచి తిరిగి వచ్చాక అతను కోటలో పాగావేశాడు. బొంబాయికి బదిలీ అయిందని బొంకి అతను భార్యనూ, పిల్లలనూ పుట్టింటికి తరిమాడు 'ఆ మహా నగరంలో మనకు ఇల్లు దొరకదు. నేను త్వరలోనే ఒక్క ఆరు నెలలలో మళ్ళీ యిక్కడికే మార్పించుకొంటాను. నువ్వు అప్పుడు వద్దువుగాని. ఇక్కడ నువ్వు ఒంటరిగా ఉండడం క్షేమంకాదు' అంటూ నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

శారద ఆ మాటలు నమ్మింది.

ఆమె విధిలేక పుట్టింటికి వెళ్ళింది,

ఆరు నెలలు ఇట్టే గడిచిపోయాయి. ఆమెకు అతి కష్టంగా గడిచాయి ఆ ఆరునెలలు. ఆ తర్వాత ఆమె తమ్ముడు ఆమెకు చెప్పకుండా బస్తీకి వెళ్లి వచ్చి "అంతా ఒట్టిదే బావ అక్కడే ఉన్నాడు నువ్వు ఇలా రావడమే తప్పు. ఇక్కడ ఉండిపోవడం ఏం బాగాలేదు, పద, తీసుకొని వెడతాను. తిరుగుళ్లు ఎక్కువయ్యాయనీ, తాగుడు బాగా అలవాటు అయిందనీ అంతా అంటున్నారు. నిజమే అనిపించింది నా మటుకు నాకు. నువ్వే దారిలోకి తీసుకొనిరావాలి. ఏది ఏమైనా నష్ట పడేది నువ్వు కనుక నువ్వు తొందరపడాలి." అంటూ గొడవచేశాడు. అతనే అందరినీ ఒప్పించి అక్కనూ, పిల్లలనూ మళ్లీ బస్తీకి చేర్చి, కాపురం పెట్టించి వచ్చాడు. తన బావమరిది తిరిగి వెళ్లిపోయేదాకా బార్ విషయం మరచిపోయి ఎంతో మర్యాదగా మసలుకొన్నాడు రాజేంద్రం. అతను వెళ్లిన మరునాటినుంచే ధనం ఇంట మందితోపాటు తనకు ఉచితంగా లభించే ఖరీదైన పానీయాలు చిత్తుగా సేవించి,

మత్తుగా తూలుతూ ఇంటికి వచ్చి గొడవ చెయ్యడం "నువ్వు నాకు విడాకులు యిచ్చి పుట్టింటికి వెళ్లు. నేను ఆమెను ప్రేమించాను. నన్ను ఆమె ఆదరించింది. నేను ఆమెను విడిచి ఉండలేను. మనకు మరో మార్గంలేదు" అనడం మొదలుపెట్టాడు. అలా కొన్నాళ్లు గడిచింది. వారానికో, పది రోజులకో ఆమెతో కలిసి, ఆమె కారులోనే వచ్చి, తను ఒక్కడే కారు దిగి, గుమ్మంలోనే భార్యతో కొంతసేపు మాట్లాడి ఇంకా వెళ్లలేదేమని పోట్లాడి అల్లరిపెట్టడం పరిపాటి అయిపోయింది. అతను ఇంటికి ఒంటరిగా వచ్చినప్పుడు ఆ అల్లరి భరించి, ఆదరించి, సేవలుచేసి, నిషాతగ్గిన తర్వాత ఎన్నోవిధాల బ్రతిమాలింది. శారద సిగ్గు చంపుకొన్నది. అభిమానం విడిచిపెట్టింది. విడాకులు కోరకండి. ఆమెను వివాహ మాడకండి నా బ్రతుకు బండలు చెయ్యకండి. పిల్లలకు ఇంత అన్యాయం తలపెట్టకండి. ఇప్పటికే వాళ్లు బెంగ పడ్డారు. ఇరుగు పొరుగువాళ్లు వాళ్లను ఏడిపిస్తున్నారు. వాళ్ల ముఖం చూచి అయినా మీరీ వ్యసనాలు మానండి" అంటూ చెప్పుకొని ఏడ్చింది శారద.

"మేం ప్రేమించుకొన్నాం నువ్వు సరిగా అర్థం చేసుకోలేక పోతున్నావు అనాడు మన ప్రేమను మీ వాళ్లు అర్థంచేసుకోనట్లుగానే ఈనాడు నువ్వు మా ప్రేమవ్యవహారాన్ని అర్థం చేసుకోలేకపోతున్నావు. మాదీ పవిత్రప్రేమే" అన్నాడు రాజేంద్రం.

ఆమె మారు మాటాడలేకపోయింది కొంతసేపు. ఆ తర్వాత తెప్పరిల్లుకొని తెగించి "అలా అయితే దాన్ని తెచ్చి ఇంట్లో పెట్టుకోండి. నేను అడ్డురాను" అన్నది. అతను చెయ్యెత్తి లాగి, చెంపదెబ్బ కొట్ట బోయి, అంతలో తమాయించుకుని వెకిలిగా నవ్వుతూ "పోనీ నువ్వు కూడా రా అక్కడకు. మన అందరినీ పోషిస్తుంది. నిన్నుకూడా

ఏలుకోనిస్తుంది అడ్డు చెప్పదు" అన్నాడు. చీదరించుకొని ఆమె లోపలకు వెళ్లింది. అతను నవ్వుకొంటూ బయటకు వెళ్లాడు. ఇలా చాలాసార్లు జరిగింది. శారద ఎన్నో విధాల మళ్లీ మళ్లీ బ్రతిమిలాడింది. భంగ పడ్డది. బెదిరించింది కాని వాటివల్ల ఏమీ ప్రయోజనం లేకపోయింది. చివరకు గత్యంతరంలేక తండ్రికీ, తమ్ముడికీ ఉత్తరం వ్రాసింది. వాళ్లు వెంటనే వస్తున్నామని సమాధానం వ్రాశారు.

* * *

శారద భర్తకోసం ధనం ఇంటికే కబురు చేసింది. వచ్చి వ్యవహారం తేల్చుకొని వెళ్లమని కోరింది. దేవిగారి పవళింపు సేవ అయ్యాక వస్తానని రాజేంద్రం తిరిగి కబురు పంపాడు. ఇంటికి వచ్చాక అన్నీ గట్టిగా చివరిసారిగా అడుగుదామని శారద నిశ్చయించుకున్నది.

ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయాక వచ్చాడతను. శారద అడిగింది.

"మీకిది న్యాయమేనా? నాకు అన్యాయం జరిగిందని బాధను పడను. కాని పిల్లలకు అందులో ఆడపిల్లలకు అన్యాయం జరుగుతుంటే సహించలేను. లోకంమాట వదిలెయ్యండి మీమాట ఏమిటి? మీకీపని ఏమైనా న్యాయంగా కన్పిస్తున్నదా?" అంటూ నాలుగూ అడిగింది. అతను నెమ్మదిగా ఏమాత్రం చలించకుండా "నీకు నేను సమాధానం చెప్పలేను. ఇప్పుడు నువ్వు ఏం చేసి లాభంలేదు. మేం వివాహం చేసుకోక తప్పదు. ఈ పుట్టలో బీరుపోసింది. ప్రసన్నుణ్ణి అయ్యాను. ఆమె కోరిన వరం ఇవ్వవలసిందే నేనింక తప్పుకోలేను అదీ పరిస్థితి నువ్వు నాకు విడాకులు యిచ్చి పుట్టింటికి వెళ్లు ఇది తాత్కాలికమైన ఏర్పాటు. ఆస్తి దక్కించుకొని మళ్ళీ నేనేవస్తాను. నమ్ము నామాట నమ్మి, నా సుఖంకోరి పిల్లలకోసం కోరి, నువ్వు నేను చెప్పినట్లు చెయ్యి. పిల్లలను లక్షాధికారులను చేస్తాను. నాదారికి నువ్వు అడ్డం నిలబడితే

అందరం అల్లరిపడతాం. కాని అందువల్ల నీకేం ఒరగదు. నేను మట్టుకు అనుకున్నది సాధించి తీరతాను. ఆ తర్వాత నీ యిష్టం" అని తేల్చి చెప్పేశాడు. అతను తన నిర్ణయం గురించి కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పేసి పట్టెమంచంమీద బూటు విప్పకుండా వెల్లకిలా పడుకొని, నోరు తెరుచుకొని నిద్రపోయాడు. ప్రక్కన కూర్చున్న శారదకు మధ్యమధ్య గుప్పున వాసనకొట్టింది. ఆమె అది భరించలేకపోయింది. ఆ పరిస్థితికి తట్టుకోలేకపోయింది. కొన్ని నిముషాల తర్వాత వెక్కి వెక్కి ఏడుస్తూ ప్రక్కగదిలోకి వెళ్లి పిల్లల దగ్గర పడుకున్నది.

• • •

చాలా రభస అవుతుందనీ, తలలు పగులుతాయనీ భయపడిన రోజున రాజేంద్రం సునాయాసంగా బయటపడ్డాడు. తండ్రినీ తమ్ముణ్నీ ఒప్పించి విడాకులు వ్రాయించింది శారద. వీధి గుమ్మందాకా వెళ్లి సాగనంపుతూ ఆమె భర్తతో "ఏదో సినిమాలో లాగా నేను మీ కాళ్ల మీద పడి ఏడుస్తాననీ, మీరు నన్ను తన్నేసి పోవచ్చుననీ అనుకున్నారేమో! లేక మావాళ్లచేత దెబ్బలు తిని కేసులు పెట్టవచ్చునని అనుకున్నారేమో! నాకు అటువంటివి నచ్చవు. వెళ్ళండి ఇక మీ ఇష్టం వచ్చినట్లు ఊరేగండి. కాని ఒక్కమాట స్పష్టంగా చెబుతున్నా. మీరు మళ్లీ నా ముఖం చూడకండి. పిల్లలమాట ఎత్తకండి. ఆ పాపిష్టిడబ్బుతో వాళ్లకు ఏదో ఒరిగిద్దామని అనుకోకండి. ఒళ్లు అమ్ముకొనే ఆడమనిషికీ, మీకూ ఏమీ తేడా లేదు. నేను ఇలా అనకూడదు. కాని అన్నాను. వాస్తవం అది. అయినా మీకు మన సంఘంలో గౌరవం ఉంటుంది. మగవాళ్లుకదా ఏం చేసినా భయంలేదు. వెలివేస్తారేమోనన్న భీతిలేదు. వెళ్లండి. ఇవిగో మంగళసూత్రాలు తీసుకొనిపోండి మీరు లేరనుకుంటాను. మీరు ఇకమీదట అలాగే అనుకోండి." అన్నది. ఆమె అలా

అనికూడా మెడలోనుంచి మంగళసూత్రం తాడు తానుగా తీసేసుకో లేక, అంతలో దుఃఖం వచ్చి, దిగమ్రింగుకొంటూ దూకుడుగా లోపలకు వెళ్లి తండ్రినీ తమ్ముణ్ణీ కౌగలించుకొని ఏడ్చింది.

రాజేంద్రం తల వంచుకుని వెళ్లిపోయాడు నెమ్మదిగా.

శారద పుట్టింట్లో ఉండి పిల్లలను సాకింది. వాళ్లకు తల్లీ తండ్రీ తనే అయింది. వయసు వచ్చి రాగానే ఇద్దరికీ ఒక్కసారే పెండ్లి చేసింది. పిల్లల పెండ్లికి రాజేంద్రం తప్పక వస్తాడని అంతా అనుకొన్నారు. వచ్చి పిలిస్తే అతను వస్తానని కబురు చేశాడు వీళ్లెవరూ వెళ్లలేదు. అతను రాలేదు.

పిల్లలు ఇద్దరూ కాపరానికి వెళ్లాక శారదకు ఒక్కసారిగా దిగులు పట్టుకొన్నది. ఆమెకు జీవితంపై విరక్తి కలిగింది. రామకృష్ణ మఠంవారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి తనకేదైనా మార్గం చూపమని ప్రాధేయపడింది. వారు సమాధానం వ్రాశారు. పట్నంలో కొంత కాలం శిక్షణ ఇచ్చి, మత ప్రచారకులుగా నియమించగలమని వారు హామీ ఇచ్చారు. శారద అందుకు సంతోషంగా అంగీకరించింది. వారు రమ్మని ఆహ్వానం పంపారు. ఆ క్షణంనుంచి ఆమెకు మనశ్శాంతి లభించింది. ఆమె అతి శీఘ్రంగా అన్నిఏర్పాట్లూ చేసుకొన్నది.

ఆ రోజు ప్రయాణానికి సిద్ధమై శారద కారులో సామాను సర్దుకొని, వళ్లీ ఇంట్లో అందరి దగ్గరా సెలవు తీసుకొని, వీధిగుమ్మంలో నిలబడి ఉండగా గేటుముందు టాక్సీ ఆగింది. ఎవరా వచ్చిందని ఆమె ఆశ్చర్యపడి అటే చూస్తుండగా ఆ టాక్సీలోనుంచి రాజేంద్రం దిగాడు. అతని వెంట మరో క్రొత్త వ్యక్తికూడా ఉన్నాడు రాజేంద్రం రొమ్ము మీదా, చేతుల మీదా కట్లు ఉన్నాయి. శారద చప్పున వెనుతిరిగి,

లోపలకు వెళ్లి, భర్తను లోపలకు తీసుకొనిరావటానికి తమ్ముణ్ణి వీధి వాకిట్లోకి పంపింది.

అతను వచ్చి ముందు గదిలో కుర్చీలో కూర్చున్నాడు. "ఏమిటి బావా రాకరాక వచ్చావ్-ఈ అవతారం ఏమిటి?" అని బావ మరిది అడిగితే, అతను తలవంచుకుని చెప్పినదంతా శారద ఆ గది గుమ్మం అవతల తెరచాటున ఉండి విన్నది. అతను అన్నీ చెప్పి చివరకు "ఆమె నా కళ్లముందే ...వ్యవహారం సాగిస్తుంటే చూచి సహించలేకపోయాను." అంటుంటే శారద చెవులు మూసుకొని "శివ శివా" అన్నది.

"నేను సహించలేక ఎదురు తిరిగాను. అందుకు ఫలితం కత్తి పోట్లు. వాళ్లే నన్ను అక్కడ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె నాకు విడాకులు ఇచ్చింది నాకు దమ్మిడి ఆస్తి చిక్కలేదు. మోసం చేద్దామనుకొని నేనే మోసపొయ్యాను. నాకు శాస్తి జరిగింది. కాని లోకం నన్ను..."అంటూ అతను ఇంకా ఏమో చెప్పకొనిపోతుంటే శారద గబగబా దొడ్డిగుమ్మం వైపుకు వెళ్లింది. ఆమె అక్కడనుంచి ఇంటి ముందుకు వచ్చి కారు ఎక్కింది. కారు బయలుదేరుతున్నప్పుడు ఆ చప్పుడు విని ఆమె తమ్ముడు. బయటకు వచ్చాడు. శారద అతన్ని దగ్గరకు పిల్చి "నన్ను ఆపకు తమ్ముడూ నన్ను మళ్లీ రొంపిలోకి దింపకు. నన్ను పోనీ. ఆయనకు ఆ కట్లు విప్పేదాకా కొన్నాళ్ల ఆశ్రియం ఇవ్వు నాకు పరలోక సౌఖ్యమైనా దక్కనీయమని మీ బావకు చెప్పు. నాకు ఇలా మనశ్శాంతి కలుగుతున్నది" అని చెప్పింది. అతను కళ్ల నీళ్లు పెట్టుకొన్నాడు. తల వంచుకొని అతను "సరేనక్కా" అన్నాడు. ఆమె ముందుకు వంగి కారుడ్రైవరుతో "పోనీ" అన్నది. అతను "ఉంటానక్కా" అన్నాడు శారద "శుభం" అన్నది నెమ్మదిగా. ఆ మాట అతనికి విన్పించలేదు. ఆమెకూ విన్పించలేదు. కలేలిన ఆ కారు హోరులో. అతను భారంగా అడుగులు వేసుకొంటూ ఇంట్లోకి వెళ్లాడు.

——